**విలేఖరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభ' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.

ఫోన్ - 8985829417



# సూర్య ప్రభ

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 2 సంచిక: 9 | ఎడిటర్ : ఇ.సంజీవరెడ్డి | శుక్రవారం, జూలై 4 2025 | పేజీలు : 4





# గ్రామాల్లో ఎన్నికల కోలాహలం

## స్థానిక ఎన్నికల్లో ఓటర్లకు డబుల్ ధమాకా..!

### సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు

### వినాయక చవితి, దసరా, దీపావళి పండుగ సమయాల్లో రానున్న ఓట్ల పండుగ..?

### పండగ సమయాల్లో ఎన్నికలంటే పోటీదారుల్లో ఆందోళన

### అన్నీ కలిసి వస్తే మరో మూడు నెలల్లో స్థానిక ఎన్నికలు

### కాంగ్రెస్ పార్టీకి కత్తిమీద సాములాగా మారనున్న ఎన్నికలు

హైదరాబాద్ : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఓటర్లకు డబుల్ ధమాకా కలిగేలా చేయనున్నాయి. సెప్టెంబర్ 30లోగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో మళ్లీ గ్రామీణ ప్రాంతాలు ఎన్నికల కోలాహలం ప్రారంభమైంది. రానున్న దసరా, దీపావళి పండుగల సమయంలోనే స్థానిక ఎన్నికలు నిర్వహించనున్నట్లుగా తెలుస్తుంది. దీనితో ఓటర్లకు వినాయక చవితి, దసరా, దీపావళి పండుగల ఖర్చులన్నీ ఎన్నికల్లో ఓట్ల రూపంలో రాబట్టుకునే అవకాశం ఏర్పడనున్నది.

ఈ పరిస్థితులు ఎన్నికలు ఖర్చులు భరించలేని అభ్యర్థులకు ప్రాణ సంకటంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలు కత్తిమీద సాములాగా మారనున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో మెజార్టీ స్థానిక సంస్థలలో గెలువాల్సిన అవసరం ఏర్పడింది. కాంగ్రెస్ రాష్ట్ర ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లు కాంగ్రెస్ నేతలు ఈ కార్యకర్తలకు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. గతంలో మెజార్టీ స్థానాలను అప్పటి బిఆర్ఎస్ పార్టీ గెలుచుకుని తమ పట్టును నిలుపుకున్నది.

**ఎక్కువ స్థానాలు తమ ఖాతాలో వేసుకునేందుకు...** ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం మార్పిడి జరిగినందున ఎక్కువ స్థానాలను తమ ఖాతాలో వేసుకోవాల్సిన అవసరం కాంగ్రెస్‌కు ఏర్పడింది. సమయానికి ఎన్నికలు నిర్వహించలేదని, మాజీ సర్పంచ్‌లను ఇంఛార్జ్‌లుగా పెట్టాలని కొందు బిసి సంఘాల నేతలు హైకోర్టులో కేసులు వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల పై హైకోర్టు ఇటు ప్రభుత్వాన్ని, అటు ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించడంతో ప్రభుత్వం నెలరోజుల సమయాన్ని అడిగింది. రిజర్వేషన్లను కొలిక్కి తెస్తామని అభ్యర్థించింది. ప్రభుత్వ నిర్ణయం తర్వాత ఎన్నికలు నిర్వహించడానికి రెండు నెలల సమయం పడుతుందని ఎన్నికల కమిషన్ హైకోర్టుకు వివరించింది. దీనితో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించడానికి మూడు నెలల సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడు నెలల సమయంలోనే దసరా, దీపావళి పండుగలు వస్తున్నాయి. ఈ సమయాల్లో ఎన్నికలు జరపడం అంటే పోటీదారులు ఓటర్లకు పండుగల ఖర్చులు మొత్తం భరించాల్సిన పరిస్థితులు ఏర్పడనున్నాయి. అందుకే ఓటర్లు దసరా, దీపావళి డబుల్ ధమాకాను అందుకోనున్నట్లుగా తెలుస్తుంది.

**ముగ్గురు పిల్లల నిబంధన పై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం...** ఆశావాహులకు అడ్డంకిగా ముగ్గురు పిల్లల నిబంధన స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉన్న వ్యక్తులు రెండు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత ఆ నిబంధనను అలాగే అమలు చేస్తూ వచ్చారు. ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అక్కడ ప్రభుత్వం ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తివేశారు. ఎంత మంది పిల్లలు ఉన్నా పోటీ చేసే అవకాశాన్ని కల్పించారు. తెలంగాణలో మాత్రంలో ఆ నిబంధనలో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో గ్రామాలలో ప్రజలకు సేవ చేస్తూ ఉన్న కొందరికి ఈ నిబంధన అడ్డంకిగా మారిందని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జనాభా నియంత్రణ కోసం అప్పట్లో ఈ నిబంధనలను, ప్రభుత్వాలు తీసుకువచ్చాయి. కానీ నేడు జనాభాను నియంత్రించాల్సిన అవసరం లేదని ప్రభుత్వాలే అభిప్రాయపడుతున్నాయి. అందుకే తెలంగాణలోనూ ఈ నిబంధనలను తొలగించాలని, అందరికీ పోటీ చేసే అవకాశాలు కల్పించాలని రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు కోరుతున్నారు.




## రాజకీయాలను షేక్ చేస్తున్న కొండా ఫ్యామిలీ..!

వరంగల్, జులై 03: అక్కడి అధికారపార్టీలో ప్రకంపనలు రేపిన ఆయన వ్యాఖ్యలపై రగడ చల్లారకముందే.. ఆయన కూతురు పెట్టిన సోషల్ మీడియా అకౌంట్ అప్‌డేట్ ఆ జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారింది. అక్కడి నుంచి పోటీచేసే అభ్యర్థిని తానే అంటూ ఆమె సోషల్ మీడియా అకౌంట్‌లో అప్‌డేట్ చేసుకున్నారు. ఇప్పటికే ఆమె తల్లిదండ్రుల మాటలతో తంటాలు పడుతున్న అధికార పార్టీకి కూతురు పెట్టిన పోస్ట్ మరో ఇబ్బందిగా పరిణమించింది. అయినా వారు డోంట్ కేర్ అంటూ ముందుకు సాగుతున్నారు. మరి ఈ పరిణామం ఏ జిల్లాలో జరిగింది. ఏం పార్టీని ఇబ్బంది పడుతోంది.. స్పెషల్ స్టోరీ మీకోసం.. తెలంగాణ కాంగ్రెస్‌లో కాకరేపిన మంత్రి కొండా సురేఖ దంపతుల వ్యవహారం ఇప్పుడు మరో అడుగు ముందుకు అన్న చందంగా సాగుతోంది. కొండా మురళీ చేసిన వ్యాఖ్యలపై సొంతపార్టీలో రాజకీయ దుమారం కొనసాగుతుండగానే.. ఆయన కూతురు కొండా సుష్మిత పటేల్ పొలిటికల్ ఎంట్రీ వరంగల్ కాంగ్రెస్‌లో ఒక్కసారిగా వేడిపుట్టించింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి తానే పోటీచేయబోతున్నట్టు కొండా సుష్మితాపటేల్ ఆమె సోషల్ మీడియా అకౌంట్‌లో అప్‌డేట్ చేసుకున్నారు. కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా అక్కడ రేవూరి ప్రకాశ్ రెడ్డి కొనసాగుతున్నారు. ఈ క్రమంలోనే సుష్మిత ఎక్స్ అకౌంట్‌లో అస్పరింగ్ పరకాల ఎమ్మెల్యే అని మార్చుకోవడం వరంగల్ కాంగ్రెస్‌లో కొత్త రచ్చకు దారితీసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొండా దంపతులు తమ కుటుంబానికి రెండు టికెట్లు కావాలని అధిష్టానాన్ని కోరారు. ముందుగా సరే అన్న పార్టీ పెద్దలు.. తీరా ఎన్నికల ముందు ఒకే కుటుంబానికి రెండు టికెట్లు సాధ్యం కాదని.. కొండా సురేఖకు వరంగల్ తూర్పు నియోజకవర్గం టికెట్ కేటాయించారు. కొండా మురళీకి ఎమ్మెల్సీ ఇస్తామని అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారట. అయితే ఎన్నికలు ముగిసి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా.. కొండా మురళీకి ఎమ్మెల్సీ ఇవ్వలేదు. దీంతో ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారట. దీనికి తోడు జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటితో పొసగడం లేదట. పొంగులేటికి అనుకూలంగా ఉండే ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ ఒక్కటయ్యారు. వీరంతా కొండా ఫ్యామిలీకి వ్యతిరేక వర్గంగా మారిపోయారు. వీరంతా పార్టీ, ప్రభుత్వ పెద్దలకు తమపై తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారని ఇటీవలే కొండా మురళీ వ్యాఖ్యానించడం రాజకీయ దుమారం రేపింది. తర్వాత గాంధీభవన్ వెళ్లిన కొండా మురళీ.. పార్టీ పెద్దలకు ఆరు పేజీల లేఖను రాసిచ్చారు. దాంట్లో వరంగల్ జిల్లా నేతలు తమ దంపతులపై ఎలాంటి కుట్రలు చేస్తున్నారో వివరించారు. కొండా మురళీ లేఖపై, ఆయన గాంధీభవన్‌లో చేసిన వ్యాఖ్యలపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కొండా మురళీని చూస్తే తమకు భయమేస్తోందంటూ మీడియాతో వ్యంగంగా మాట్లాడారు. తర్వాత కొండా దంపతుల వ్యతిరేక వర్గం ఎమ్మెల్యేలైన కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ మరోమారు అత్యవసరంగా సమావేశమయ్యారు. మురళీ తమపై చేసిన వ్యాఖ్యలపై చర్చించారు. పార్టీ పెద్దలకు మరోసారి మౌఖిక ఫిర్యాదు చేశారట. అయితే తమ పరిశీలనలో ఉందని పార్టీ పెద్దలు చెప్పగానే నిర్ణయం కోసం వేచిచూస్తున్నామన్నారు కొండా వ్యతిరేక వర్గ ఎమ్మెల్యేలు. ఇలా కొండా మురళీ వ్యాఖ్యలపై దుమారం కొనసాగుతుండగానే.. ఆయన కూతురు కొండా సుష్మితాపటేల్ ఎంట్రీ ఇచ్చారు. పరకాల నియోజకవర్గానికి 'నేనే ఎమ్మెల్యే అభ్యర్థి' అంటూ తన సోషల్ మీడియా అకౌంట్ బయోను అప్‌డేట్ చేశారు. సుష్మిత చేసిన ఈ అప్డేట్ వరంగల్ కాంగ్రెస్‌లో చర్చానీయంశంగా మారింది. పరకాల సిట్టింగ్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీకే చెందిన రేవూరి ప్రకాశ్ రెడ్డి కొనసాగుతున్నారు. అయితే ఇటీవల కొండా మురళీ రేవూరిపై కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 75ఏళ్ల ముసలోడు నాకాళ్లు పట్టుకుంటే పరకాల నుంచి గెలిపించానని.. తర్వాత తనకు వ్యతిరేకంగా ఆయన కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యల దుమారం చల్లారకముందే కొండా సుష్మిత పరాకలకు ఎంట్రీ ఇస్తున్నానని సంకేతాలు ఇవ్వడం కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. కొండా దంపతుల కుమార్తె ఎంట్రీతో.. వరంగల్ కాంగ్రెస్ రాజకీయాల్లో మరింత అలజడి వాతావరణం పెరిగింది. మరో ఫైర్ బ్రాండ్‌గా పేరున్న కొండా సుస్మితా పటేల్.. ఫుల్ టైమ్ రాజకీయాల్లో అలర్ట్ ఉంటే ఎలా ఉంటుందోనని పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై వరంగల్ కాంగ్రెస్ నేతలు ఏ విధంగా స్టాండ్ తీసుకుంటారోనని రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.




## తప్పకుండా ముఖ్యమంత్రి అవుతా: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ : రాజకీయాల్లో ఎమ్మెల్సీ కవిత దూకుడు పెంచారు. జాగృతి బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించారు. జాగృతి సంస్థ ఉద్యమం నుంచే ఉండగా.. ఉద్యమంలో సాంస్కృతిక అంశాలపై పోరాడింది. మరోసారి దీనిని బలోపేతం చేయడానికి కవిత కృషి చేస్తున్నారు.

ఇందులో భాగంగానే ప్రస్తుతం వేగం పెంచారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ మీడియా ఛానల్కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చాలా ఓపెన్గా మాట్లాడారు. మీరు సీఎం అవుతారా అన్న ప్రశ్నకు ఆసక్తికర సమాధానం ఇచ్చారు. 'ఇంకో పదేళ్లకో, పదిహేనేళ్లకో, ఎప్పటికైనా తప్పకుండా ముఖ్యమంత్రి అవుతా. ఎవరైనా రాజకీయాల్లో వ్యక్తిగతంగా ఎదగాలనే కోరుకుంటారు' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే.. నిజామాబాద్పై దృష్టి సారిస్తా.. ఊహించని రీతిలో అభివృద్ధికి ప్రయత్నిస్తా అని చెప్పారు.

# పెట్టుబడులకు స్వర్గధామం...

# మన తెలంగాణ!

## మహేశ్వరంలో మలబార్ తయారీ యూనిట్‌సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జులై 03: హైదరాబాద్‌ను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మహేశ్వరంలో మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరంలో మలబార్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించబోతున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామన్నారు. మహేశ్వరంలో ఫోర్త్ సిటీ భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించబోతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా మన పారిశ్రామిక పాలసీలు మార్చలేదని గుర్తు చేశారు. పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ ముందుకు వెళుతున్నామని వివరించారు.

పెట్టుబడులను ఆకర్షించడమే కాదు.. వారికి లాభాలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి యూనిట్ ఏర్పాటు చేసిన మలబార్ గ్రూప్‌నకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.




**హైదరాబాద్ చేరుకున్న ఏఐసీసీ చీఫ్..** తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే గురువారం సాయంత్రం హైద రాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో దిగిన ఆయనకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. అనంతరం నగరంలోని తాజ్ కృష్ణ హోటల్‌కు ఖర్గే చేరుకున్నారు. అయితే మంత్రి పదవి ఆశించి భంగపడ్డ పలువురు ఎమ్మెల్యేలతో ఖర్గే భేటీ కానున్నారు.

అందుకోసం వారికి ఖర్గే అపాయింట్‌మెంట్ ఇచ్చారు. కాగా, ఆది శ్రీనివాస్, బాలు నాయక్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్ సాగర్ రావు, సుదర్శన్ రెడ్డి, తదితరులు ఇప్పటికే తాజ్ కృష్ణా హోటల్‌కు చేరుకున్నారు. అలాగే తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య సైతం ఖర్గేతో భేటీ కానున్నారు. జులై 4వ తేదీన నగరంలోని ఎల్బీ స్టేడియంలో పార్టీ కార్యకర్తలతో భారీ సభ జరగనుంది. ఈ సభకు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

ఆ సందర్భంగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు క్యాడర్‌కు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భారీగా కేడర్‌ను ఈ సభకు తరలించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు శుక్రవారం జరగనున్న ఈ సభకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.

## సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చెయ్యండి.

**ఎమ్మెల్సీ సత్యం పిలుపు నిచ్చారు**

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా) సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను ఆగష్టు 19 నుండి 22 వరకు మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం లో నిర్వహిస్తున్నామని ఈ మహాసభలకు రాష్ట్రంలోని అన్ని మండలాల నుండి ఎంపిక చేసిన 1000మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని కావున రాష్ట్ర మహాసభల విజయవంతం కొరకు ప్రతి ఒక్కరు సహకరించాల్సిందిగా కోరుతూ నేడు సిపిఐ ఎమ్మెల్సీ సత్యం ఎమ్మెల్సి శంబిపూర్ రాజు ని కలవడం జరిగింది. ఈ సందర్భం గా శంబిపూర్ రాజు ఎమ్మెల్సీ కి శాలువాతో సత్కరించి మహాసభల






విజయవంతం కోసం తన వంతుగా సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్,జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం,మండల కార్యదర్శి స్వామి పాలాభిందల శ్రీనివాస్,సిపిఐ నాయకులు వి.శ్రీనివాస్,హరినాథ్,నర్సింహా రెడ్డి,యాదయ్య,జంబూ మాజీ కార్పొరేట్పర్ సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

## శ్రీ వారాహి అమ్మవారి ఆషాడ గుప్త నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రావుల శేషగిరి...

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలో గాజులరామారం డివిజన్ షిరిడి హిల్స్ లో శ్రీ శ్రీ హర్షిత్ మహారాజ్ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వారాహి అమ్మవారి ఆషాడ గుప్త నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి ఈ





కార్యక్రమంలో బిజెపి నాయకులు గడ్డమీద భరత్ కుమార్ పాలవలస రవి కుమార్ మురళీకృష్ణ సాయి రెడ్డి మధు శ్రీకాంత్ అనిల్ మంజునాథ్ షిరిడి హిల్స్ కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ రమేష్ జనరల్ సెక్రెటరీ సత్య ప్రభాకర్ రావు ట్రెజరర్ బాలకిషన్ శ్రీనివాస్ రెడ్డి ఎస్. ఎస్.వి తదితర నాయకులు పాల్గొన్నారు

## హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమ్మేళన విజయవంతం చేయాలన్న కోలన్ హనుమంత్ రెడ్డి...

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)కుత్బుల్లాపూర్ నియోజక వర్గం. జూలై 4వ. తేదీ నాడు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖార్గి సమావేశము సభకు తరలి వెళ్ళడానికి. కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య. జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి . కోఆర్డినేటర్స్ శశికళ . గజ్జల





కాంతం. ఏపీ మిథున్ రెడ్డి. మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి .మేడ్చల్ మల్కాజిగిరి డి.సి.సి ఉపాధ్యక్షులు దమ్మని శ్రావణ్ కుమార్.కాంగ్రెస్ సీనియర్ నాయకులు అవిజ జేమ్స్. సిద్ధనోళ్ల సంజీవరెడ్డి. ఎండి జాంగిర్ బాయ్. మేకల ఎల్లయ్య. డివిజన్ అధ్యక్షులు. మహిళా కాంగ్రెస్ నాయకురాలు. యువజన కాంగ్రెస్ నాయకులు. ఐ ఎన్ టి యు సి నాయకులు. ఎన్ ఎస్ యు ఐ నాయకులు మరియు కార్యకర్తలు. తదితరులు. పాల్గొన్నారు.

## వారాహి అమ్మవారి కృపా కటాక్షాలు భక్తుల అందరి పై ఉండాలి : బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ...







కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజుల రామారం125 డివిజన్ షిరిడి హిల్స్ లో వారాహి అనుగ్రహ పీఠం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ హర్షిత్ మహారాజ్ గురూజీ పర్యవేక్షణలో నిర్వహించిన శ్రీ వారాహి అమ్మవారి ఆషాడ గుప్త నవరాత్రుల వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.... మహిమాన్విత అమ్మవారైన వారాహి అమ్మవారి కృపా కటాక్షలతో ప్రజలంతా సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమం లో షిర్డీ హిల్స్ కాలనీ ప్రెసిడెంట్ రమేష్, ప్రధాన కార్యదర్శి సత్య, కోశాధికారి బాల కిషన్, కాలనీ వాసులు ప్రభాకర్ రావు, యశస్వి, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, ఇబ్రహీం ఖాన్, మూసా ఖాన్, తెలంగాణ సాయి, సుంకరి చందు, చిన్నా చౌదరి, కరుణాకర్ రాజు, ప్రసాద్, మహేష్, శివా నాయక్, జునైద్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం :- సైనిక గ్రూప్..










కుత్బుల్లాపూర్ (సూర్యప్రభా)గురువారం సైనిక గ్రూప్ సూరారం పోలీస్ స్టేషన్ %CI% భరత్ కుమార్ చేతుల మీదుగా సైనిక గ్రూప్ డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం అనే పోస్టర్ ను ఆవిష్కరణ చేసి జనగామ జిల్లా ఇంచార్జ్ పండు. నవపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గంజాయి, మత్తు పదార్థాల పైన బెట్టింగ్ యాప్స్ పైన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి, ప్రతి ఒక్క విద్యార్థి కూడా డ్రగ్స్ మాయలో పడకుండా ఉండాలి మాదక ద్రవ్యాలను ఎట్టి పరిస్థితుల్లో సహించదు అని బెట్టింగ్ యాప్స్ కి ప్రతి ఒక్కరు కూడా దూరంగా ఉండాలి మన భారతదేశంలో ఉన్న ప్రతి స్త్రీకి మనం ఒక అండదండై అయి ఉండాలి స్త్రీలు ఎక్కడ పూజింప బడతారో దేవతలు అక్కడ సంచరి మన భారతదేశంలో ఉన్నటువంటి ప్రతి ఒక్క ఆడబిడ్డ కు మనం ధైర్యంగా ఉండాలి మనమంతా కలిసి భారతదేశం ను డ్రగ్స్ లేని సమాజంగా నిర్మిద్దాం మీ దృష్టికి మత్తు పదార్థాలను స్వీకరిస్తున్నట్టు ఎవరైనా కనిపిస్తే వెంటనే మీ పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వండి లేదంటే డయల్ తెలంగాణ పోలీస్ 122 కాల్ చేసి సమాచారాన్ని తెలపండి. అలాగే మిలటరీ, డిఫెన్స్ జాబ్స్ కి ,తెలంగాణ స్టేట్ పోలీస్ జాబ్స్ కి ప్రిపేర్ అయ్యే ప్రతి ఒక్క అభ్యర్థికి కూడా మా సైనిక గ్రూప్ అండగా ఉంటుంది ఇప్పటిదాకా సైనిక గ్రూపులో రెండో తెలుగు రాష్ట్రాల నుంచి 8,000 మందికి పైగా కోచింగ్ తీసుకోవడం జరుగుతుంది అలాగే ఇప్పటిదాకా 175 మందికి పైగా ఉద్యోగం సాధించారు . 10%th% అయిపోగానే ఎవరు కూడా చెడు దారుల వెళ్ళకూడదు డిఫెన్స్ పట్ల వెళ్లాలి అని మీకు ఆసక్తి ఉంటే ప్రతి ఒక్క విద్యార్థికి కూడా మేం సపోర్ట్ చేస్తాం అలాగే 60 రోజులకు ఒకసారి 30 మంది విద్యార్థులకి ఉచితంగా ఫిజికల్ కోచింగ్ అండ్ హాస్టల్ భోజన వసతి కూడా కల్పిస్తాం అని జనగామ జిల్లా ఇన్చార్జ్ పండు తెలియజేయడం జరిగింది. కావున ప్రతి ఒక్క అభ్యర్థి కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి ఎవరు కూడా మీ సమయాన్ని వృధా చేసుకోకండి . ఈ కార్యక్రమంలో సైనిక గ్రూప్ వ్యవస్థాపకులు లోకేష్, శివకుమార్, ప్రసాద్, సంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ అలిగే నర్సింగ్, సైనిక గ్రూప్ టీమ్ మెంబర్స్ పాల్గొనడం జరిగింది.

## ప్లాస్టిక్ నిషేధిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం సొంటిరెడ్డి పున్నారెడ్డి ...





కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)ప్లాస్టిక్ నిషేధిద్దాం... పర్యావరణాన్ని కాపాడుదాం..... మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ పి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి బుధవారం నాడు అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని "అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే" అని కూడా అంటారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి ప్లాస్టిక్ ర రహిత సమాజం కొరకు జ్యూట్ బ్యాగులను డిస్ట్రిబ్యూట్ చేయడం జరిగినది ప్రతి ఒక్కళ్ళు కూడా మార్కెట్ కి వెళ్లేటప్పుడు జ్యూట్ బ్యాగులు తీసుకొని వెళ్ళాలని కోరుకోవడం జరిగింది .

ప్లాస్టిక్ కాలుష్యం వల్ల పర్యావరణానికి కలిగే హాని గురించి అవగాహన కల్పించడానికి, ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని తగ్గించాలని తెలియజేయడమైనది

## గుమ్మల స్వామి ముదిరాజ్ ఆధ్వర్యంలోవ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని కలిసిన తెలంగాణ ముదిరాజ్ మహాసభ సభ్యులు..

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావుని గురువారం మర్యాదపూర్వకంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గుమ్మల స్వామి ముదిరాజ్ ఆధ్వర్యంలో మంత్రి ఛాంబర్ లో కలవడం జరిగినది. ఈ కార్యక్రమంలో కుత్బుల్లా పూర్ ముదిరాజ్ మహాసభ సభ్యులు గుమ్మడి మధుసూదన్ రాజు,పెంట య్య,రమేష్ నరేందర్ ,నరసింహ,వెంకటేష్



,చెన్నయ్య ముదిరాజ్ శివ నరసింహసూర్యనారాయణ మరియు బంధుమిత్రుల తో కలవడం జరిగింది.

## ఐకమత్యంతో పనిచేస్తూ రాజీవ్ గృహకల్ప అభివృద్ధికి నూతన కార్యవర్గ సభ్యులు పనిచేయాలి : బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ...

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బాచుపల్లి 2 బి.హెచ్.కే – 7వ బ్లాక్ నూతన కార్యవర్గ కమిటీ సభ్యులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... రాజీవ్ గృహకల్ప లోని లబ్ధిదారుల సమస్యలు, బాగోగులను





తెలుసుకుంటూ ఐకమత్యంతో రాజీవ్ గృహకల్పను అభివృద్ధి చేసుకునే విధంగా నూతన కార్యవర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. రాజీవ్ గృహకల్పలో సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గ సభ్యులకు నా మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు దుర్గాప్రసాద్, ముఖ్య సలహాదారులు మద్దెల సత్యనారాయణ, సలహాదారులు భాస్కరాచారి, ప్రధాన కార్యదర్శి సత్యవతి, కోశాధికారి మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత, సంయుక్త కార్యదర్శి రామారావు, ఉపాధ్యక్షులు సజ్జు, కార్యనిర్వా కార్యదర్శి సైదులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతీ ఒక్కరూ సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి మాజీ కార్పొరేటర్ కెఎం. గౌరీష్....

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా) కుత్బుల్లాపూర్ డివిజన్ ఎన్.టీ.ఆర్ నగర్ కు చెందిన బాణాల ప్రమీల (32) భర్త రామ్ కుమార్ అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయాన్ని స్థానిక పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 1.00 లక్ష రూపాయలను మంజూరు చేయించగా గురువారం కుత్బుల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయం నందు మాజీ కార్పొరేటర్ కెఎం.గౌరీష్ చేతులమీదుగా



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....అనారోగ్య సమస్యతో బాధపడుతూ మెరుగైన చికిత్సకై ఎదురుచూస్తున్న ప్రతి ఒక్క నిరుపేద లబ్ధిదారుడు ఈ ఎల్ఓసి సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు నార్లకంటి బాలయ్య, సదానంద్ చారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికై పనిచేస్తున్నాం : బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ...

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు





బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, నియోజకవర్గ అభివృద్ధే సాక్ష్యంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తున్నామన్నారు.




హైదరాబాద్, జులై 03: మాజీ సీఎం, బీఆర్ఎస్ చీఫ్ కె. చంద్రశేఖర్ రావు ఆరోగ్యంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరా తీశారు. కేసీఆర్ అనారోగ్యానికి గురికావడం.. వెంటనే ప్రైవేట్ ఆసుపత్రిలో చేరడంతోపాటు ఆయనకు అందిస్తున్న చికిత్సకు సంబంధించిన వివరాలను ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్‌కు మెరుగైన చికిత్స అందించాలని ఈ సందర్భంగా వైద్యులు, ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని.. మంచి ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కొన్ని రోజులుగా జలుబు, దగ్గు, జ్వరంతో మాజీ సీఎం కేసీఆర్ బాధపడుతున్నారు. దీంతో ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ నుంచి గురువారం నాడు నందినగర్‌లోని తన నివాసానికి కేసీఆర్ చేరుకున్నారు. అక్కడ ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అయితే ఆయనకు మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. దీంతో ఆయన్ను ఆసుపత్రిలో చేరాలని వైద్యులు సూచించారు. వారి సూచనలకు అనుగుణంగా సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో కేసీఆర్ చేరారు. ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కేసీఆర్ ఆసుపత్రిలో చేరిన సమయంలో ఆయన వెంటే మేనల్లుళ్లు హరీశ్ రావు, సంతోష్ రావులు ఉన్నారు. మరోవైపు కేసీఆర్ ఆసుపత్రిలో చేరడంతో.. సోమాజిగూడకు భారీఎత్తున బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు చేరుకుంటున్నారు. కాగా, యశోద ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు. ఇక కేసీఆర్ ఆరోగ్యంపై యశోద ఆసుపత్రి హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. కేసీఆర్.. నిరసంతో ఆసుపత్రిలో చేరారని వైద్యులు తెలిపారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు. కేసీఆర్‌కు చికిత్స కొనసాగుతుందని యశోద ఆసుపత్రి వైద్యులు స్పష్టం చేశారు.




## సోనూసూద్ మంచి మనసు.. ఆ రైతు కష్టం చూసి చలించిపోయి..

ప్రముఖ నటుడు సోనూసూద్ మంచితనం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కరోనా మహమ్మారి పీక్స్‌లో ఉన్న సమయంలో ఎంతో మందికి ఆయన సాయం చేశారు. ఇప్పటికీ సాయం చేస్తున్నారు. అడిగిన వారికి.. అర్హులైన వారికి కాదనకుండా సాయం చేస్తున్నారు. తాజాగా, ఓ రైతు కష్టం చూసి సోనూసూద్ చలించిపోయారు. ఆయనకు సాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఆ రైతుకు అదిరిపోయే గిఫ్ట్ ఇవ్వనున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. మహారాష్ట్ర, లాతూర్ జిల్లా, హదోల్తి గ్రామానికి చెందిన 76 ఏళ్ల అంబదాస్ పవార్ అనే రైతుకు పొలం ఉంది. ఆయనకు పొలం ఉన్నా.. ఖర్చు పెట్టి దాన్ని దున్నించేంత డబ్బు లేదు. అందుకే భార్యా, భర్తలు కలిసి నాగలి లాంటి పరికరాన్ని తయారు చేసుకున్నారు. దాన్ని పొలానికి తీసుకెళ్లారు. భార్య నాగలి మేడితోక పట్టుకుంది. ఆ వృద్ధ రైతు నాగలి కోలను మెడకు వేసుకుని లాగాడు. ఇలా ఇద్దరూ ఆ పొలం మొత్తం దున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నటుడు సోనూసూద్ దృష్టికి కూడా వెళ్లింది. ఈ నేపథ్యంలోనే ఆ వృద్ధ దంపతుల కష్టం చూసి ఆయన చలించిపోయారు.

వారికి సాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో .. 'మన రైతు సోదరుడికి ట్రాక్టర్ నడపటం రాదు. అందుకే ఎద్దులు గిఫ్ట్‌గా ఇస్తాను' అని అన్నారు. సోనూసూద్ తమకు ఎద్దులు గిఫ్ట్ ఇవ్వబోతున్నాడని తెలిసి ఆ వృద్ధ దంపతులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. సోషల్ మీడియాలో సైతం సోనూసూద్‌పై ప్రశంసల జల్లులు కురుస్తున్నాయి.




హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల సాధన కోసం జులై 17న రైల్ రోకోకు పిలుపునిచ్చామని భారాస ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామన్న సీఎం ఇంకా స్పందించలేదన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి వీల్లేదని పేర్కొన్నారు. భాజపాపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఖర్గేకు లేఖ రాస్తున్నట్లు తెలిపారు.

"జులై 8 లోపు అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలి. కాంగ్రెస్‌లోని బీసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. బీసీ రిజర్వేషన్ల కోసం భారాస సహకరిస్తోంది. గోదావరి–బనకచర్ల విషయంలో ప్రభుత్వం మెతక వైఖరి అవలంబిస్తోంది" అని కవిత అన్నారు.



## వరంగల్ ఇష్యూ.. మీనాక్షికి నివేదిక ఇచ్చిన కొండా దంపతులు

హైదరాబాద్, జులై 3: కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కొండా దంపతులు కలిశారు. ఈరోజు (గురువారం) ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు వచ్చిన కొండా మురళి, సురేఖ.. ఉమ్మడి వరంగల్‌లో జరుగుతున్న అంశాలపై మీనాక్షికి నివేదిక ఇచ్చారు. మొత్తం 16 పేజీల నివేదికను మీనాక్షి నటరాజన్‌కు కొండా సురేఖ అందజేశారు. ఉమ్మడి వరంగల్‌లో నియోజకవర్గం వారిగా ఇంచార్జ్‌కు రిపోర్ట్ ఇచ్చారు. తమపై వచ్చిన ఆరోపణలపై మీనాక్షికి కొండా సురేఖ, కొండా మురళీ సమాధానం చెప్పారు. రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చామని చెప్పిన కొండా దంపతులు.. నిజాలు తెలుసుకున్న తర్వాత ఎవరిది తప్పుంటే వాళ్ళపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**నేను ఏ తప్పు చేయలేదు: కొండా సురేఖ...** ఇంచార్జ్‌తో భేటీ అనంతరం కొండా దంపతులు మీడియాతో మాట్లాడారు. 'నాకు ఇచ్చిన శాఖలకు న్యాయం చేస్తున్నాను. రూల్స్ ప్రకారమే నేను పని చేస్తున్నాను. నా డిపార్ట్మెంట్‌లో ఉన్న ఫైల్స్ అన్నీ పరిశీలించుకోవచ్చు. మంత్రిగా నేను ఇప్పటి వరకు ఎలాంటి తప్పులు చేయలేదు. నా మంత్రి పదవిపై ఎవరు మాట్లాడినా నేను స్పందించాను. సుష్మితలో పారేది కొండా మురళీ, కొండా సురేఖ రక్తం. నా కూతురికి మా ఆలోచనలు వంశ పారపర్యంగా రావడంలో తప్పు లేదు. సుష్మిత రాజకీయ ఆలోచనలను తప్పు పట్టలేం' అని కొండా సురేఖ అన్నారు.

**అదే నా ఉద్దేశం: కొండా మురళి...** 'నేను బీసీ కార్డును పట్టుకునే బతుకుతున్నాను. అణగారిన వర్గాలు బలం ఉన్నవాడి దగ్గరికే వస్తారు. పేదల సమస్యలు తీర్చుతాను కాబట్టే జనం నా దగ్గరికి వస్తాను. నాకు ప్రజాబలం ఉంది. పనిచేసే వారిపైనే బండలు వేస్తారు. నడిచే ఎద్దునే పొడుస్తారు . పార్టీ ఎవరికి టికెట్లు ఇచ్చిన గెలిపించే బాధ్యత నేను తీసుకుంటానని మీనాక్షితో చెప్పాను. మమ్మల్ని పార్టీ ఉపయోగించుకోవాలని చెప్పాను. పార్టీకి మీ సేవలు అవసరమని మీనాక్షి చెప్పారు. కాంగ్రెస్ పార్టీని బతికించడమే నా ఉద్దేశం. రాహుల్ గాంధీని ప్రధాని చేయడం నా ఉద్దేశం. రేవంత్ రెడ్డిని ఇంకో పదేండ్లు ముఖ్యమంత్రిగా చూడడం నా ఉద్దేశం. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌కు అండగా నిలుస్తా' అని కొండా మురళి స్పష్టం చేశారు. కాగా.. గత కొద్ది రోజులుగా ఉమ్మడి వరంగల్ పంచాయతీ కొనసాగుతున్న విషయం తెలిసిందే. కొండా వర్సెస్ మిగతా నాయకులుగా వివాదం నడుస్తోంది. ఇప్పటికే ఇరు వర్గాల నేతలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. గత శనివారం గాంధీ భవన్‌కు వచ్చిన కొండా మురళి.. క్రమశిక్షణ కమిటీతో భేటీ అయి నివేదికను అందజేశారు. తనపై వచ్చిన ఆరోపణపై వారం రోజుల్లో లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని కొండా మురళిని క్రమశిక్షణ కమిటీ ఆదేశించింది.




హైదరాబాద్: తాను వెనుకబడిన వర్గాల ప్రతినిధిని అని కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. తన సతీమణి, మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో భేటీ అయ్యారు. ఉమ్మడి వరంగల్‌లో జరుగుతున్న అంశాలపై ఆమెకు నివేదిక ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "ఒకరి గురించి నేను కామెంట్ చేయను. నాకు ప్రజాబలం ఉంది. చాలా కేసులకే నేను భయపడలేదు.. భయం లేదని ముందు నుంచీ చెబుతూనే ఉన్నా.

**పేదల సమస్యలు పరిష్కరిస్తాం కాబట్టే జనం నా దగ్గరికి వస్తారు...** నేను బీసీ కార్డు పట్టుకునే బతుకుతున్నా. పేదల సమస్యలు పరిష్కరిస్తాను కాబట్టే జనం నా దగ్గరికి వస్తారు. పనిచేసే వారిపైనే కొందరు రాళ్లు వేస్తారు. నడిచే ఎద్దునే పొడుస్తారు. పార్టీ ఎవరికి టికెట్లు ఇచ్చినా గెలిపించే బాధ్యత నేను తీసుకుంటానని మీనాక్షి నటరాజన్‌తో చెప్పా. మా సేవల్ని పార్టీ ఉపయోగించుకోవాలని కోరా. కాంగ్రెస్ పార్టీని బతికించడమే నా ఉద్దేశం. రాహుల్ గాంధీని ప్రధాని చేయడం నా లక్ష్యం. రేవంత్‌రెడ్డిని ఇంకో పదేళ్లు ముఖ్యమంత్రిగా చూడాలి. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు అండగా నిలుస్తా. శుక్రవారం జరగబోయే సభపై చర్చించాం. వరంగల్ నుంచి ఎంత మంది వస్తారనే అంశంపై మాట్లాడాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచేలా కృషి చేస్తా. ఎమ్మెల్యేలను మళ్లీ వరంగల్‌లో గెలిపించడమే నా బాధ్యత. నేను ఎవరికీ భయపడేది లేదు. ఎలాంటి గ్రూపు రాజకీయాలతో నాకు సంబంధం లేదు" అని కొండా మురళి తెలిపారు.

**సుష్మిత రాజకీయ ఆలోచనలను తప్పు పట్టలేం: కొండా సురేఖ...** తనకు ఇచ్చిన శాఖలకు న్యాయం చేస్తున్నానని మంత్రి కొండా సురేఖ అన్నారు. "నిబంధనల ప్రకారమే పని చేస్తున్నాను. నా శాఖలో ఉన్న ఫైల్స్ అన్నీ పరిశీలించుకోవచ్చు. మంత్రిగా ఇప్పటివరకు ఎలాంటి తప్పులు చేయలేదు. సుష్మితలో పారేది కొండా మురళి, కొండా సురేఖ రక్తం. ఆమెకు మా ఆలోచనలు వంశపారంపర్యంగా రావడంలో తప్పు లేదు. సుష్మిత రాజకీయ ఆలోచనలను తప్పు పట్టలేం. భవిష్యత్తు ఎలా ప్లాన్ చేసుకోవాలో నిర్ణయించే అధికారం ఆమెకు ఉంది. పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూస్తాం." అని కొండా సురేఖ అన్నారు. ఇటీవల ఓ కార్యక్రమంలో వరంగల్‌లోని నేతలను ఉద్దేశించి కొండా మురళి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను ఇటీవల పీసీసీ క్రమశిక్షణ కమిటీ.. గాంధీ భవన్‌కు పిలిచి వివరణ అడిగింది. దీనిపై లిఖిత పూర్వక వివరణ కోసం మళ్లీ షోకాజ్ నోటీసు కూడా ఇచ్చింది.

## బీసీ రిజర్వేషన్లపై కవిత లేఖ రాయడం హాస్యాస్పదం: మహేశ్ కుమార్‌గౌడ్



హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై ఎమ్మెల్సీ కవిత.. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు లేఖ రాయడం హాస్యాస్పదంగా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాస నాయకురాలిగా లేఖ రాశారా, జాగృతి అధ్యక్షురాలి హోదాలో రాశారో చెప్పాలన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కవిత.. బీసీల గురించి మాట్లాడారా? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న రిజర్వేషన్లను 21 శాతానికి తగ్గించింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. 2014 నుంచి 2018 వరకు తెలంగాణ క్యాబినెట్‌లో ఒక్క మహిళ కూడా లేనప్పుడు స్పందించారా? ఉద్యమాలు చేశామని చెప్పుకొంటున్న కవిత ఏనాడైనా సాటి మహిళల గురించి మాట్లాడారా అని నిలదీశారు. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం సామాజిక సమరభేరి పేరిట కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. గ్రామకమిటీలను ఉద్దేశించి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ప్రసంగిస్తారని తెలిపారు.

## సిగాచీ పరిశ్రమలో నిపుణుల కమిటీ అధ్యయనం



సంగారెడ్డి: పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో 38 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ బృందం గురువారం పరిశ్రమను పరిశీలించింది. అగ్నిప్రమాదం జరిగిన తీరుపై అధ్యయనం చేస్తోంది. కార్మికుల భద్రతకు యాజమాన్యం నిబంధనలు పాటించిందా? లేదా?అన్న అంశంపై విచారణ చేపట్టింది. నెల రోజుల్లో ప్రమాదంపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఈ కమిటీకి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ఎమెరిటస్ శాస్త్రవేత్త డాక్టర్ బి.వెంకటేశ్వరరావు ఛైర్మన్‌గా.. ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ టి.ప్రతాప్‌కుమార్, చెన్నైలోని సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ సూర్యనారాయణ, పుణెలోని నేషనల్ కెమికల్ ల్యాబ్ భద్రతాధికారి డాక్టర్ సంతోష్ గుగే సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయడంతోపాటు భవిష్యత్తులో కెమికల్, ఫార్మా పరిశ్రమల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన సూచనలు, విధివిధానాలతో నివేదిక రూపొందించనుంది.

## బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై రామచందర్ రావు విమర్శలు



బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ(గురువారం) రామచందర్ రావు మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటా లేదా.. బీజేపీతో ఎవరికైనా మైత్రి ఉందా అనేది వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో, గ్రేటర్ ఎన్నికల్లో తెలుస్తుందని చెప్పుకొచ్చారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కమల వికాసమేనని ధీమా వ్యక్తం చేశారు. తనకు తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి రావడంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పాత్ర ఉందని ఎవరూ నిరూపించిన వారికీ ఆస్కార్ అవార్డ్ ఇప్పిస్తామని విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులకు తాము సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నారు. బీజేపీ అధిష్టానం తనకు ఇచ్చిన అవకాశాన్ని ప్రతి కార్యకర్త, పార్టీ అధికారం కోసం పనిచేస్తానని రామచందర్ రావు పేర్కొన్నారు.




## జగన్ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బ తీసింది: బీజేపీ ఎంపీ లక్ష్మణ్

తిరుమల: గత జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమలలో చాలా అక్రమాలు జరిగాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ఆరోపించారు. గతంలో ఉన్న టీటీడీ పాలకమండళ్లు భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడాయని విమర్శించారు. ఇవాళ(గురువారం) ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో వెంకటేశ్వర స్వామివారిని లక్ష్మణ్ దర్శించుకున్నారు. అనంతరం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామి వారి లడ్డూలో జరిగిన కల్తీ భక్తులను ఆందోళనకు గురి చేసిందని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో తిరుమలలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని సీఎం చంద్రబాబుకు లేఖ రాస్తానని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

# అనిల్ అంబానీ కంపెనీ 31వేల కోట్ల కుంభకోణం!

అనిల్ అంబానీ కంపెనీ 31వేల కోట్ల కుంభకోణం వెలుగుచూసింది. నష్టాల్లో కూరుకుపోయిన అనిల్ అంబానీకి చెందిన టెలికాం దిగ్గజం రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) మరో వివాదంలో చిక్కుకుంది. దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆర్‌కామ్‌కు ఇచ్చిన రుణాన్ని 'మోసపూరితం' (ఫ్రాడ్)గా ప్రకటించడంతో ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఆర్‌కామ్ డైరెక్టర్ అనిల్ అంబానీ పేరును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి అధికారికంగా నివేదించేందుకు ఎస్‌బీఐ సిద్ధమవుతోంది.

**రుణ మోసం వివరాలు ఏమిటి?**... ఎస్‌బీఐతో సహా అనేక బ్యాంకులు ఆర్‌కామ్‌కు, దాని అనుబంధ సంస్థలకు కలిపి మొత్తం ?31,580 కోట్లు రుణంగా ఇచ్చాయి. అయితే ఈ నిధులను చట్టవిరుద్ధంగా ఇతర అనుబంధ కంపెనీలకు మళ్లించారని, సంక్లిష్టమైన లావాదేవీలు నిర్వహించారని ఎస్‌బీఐ ఆరోపించింది. బ్యాంక్ ఫ్రాడ్ ఐడెంటిఫికేషన్ కమిటీ ఈ వ్యవహారంపై లోతైన విచారణ జరిపిన అనంతరం, ఈ రుణ ఖాతాను అధికారికంగా మోసపూరితంగా గుర్తించింది.

**బ్యాంకుల తదుపరి చర్యలు ఎలా ఉండబోతున్నాయి?...** %బాశ్రీంశీ =ఘుఽ% – జుకర్‌బర్గ్ ఆకస్మిక ప్రవేశం: ట్రంప్ మిలిటరీ భేటీలో కలకలం.. బయటకు పంపించేశారు. ఒక రుణ ఖాతాను



'మోసపూరితం'గా గుర్తించిన తర్వాత, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ప్రమోటర్లు , పూర్తికాల డైరెక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా, అనిల్ అంబానీకి సంబంధించి కొన్ని ముఖ్యమైన పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఐదేళ్ల పాటు బ్యాంకు రుణాలపై నిషేధం విధించింది. మోసపూరితంగా గుర్తించిన కంపెనీల ప్రమోటర్లకు భవిష్యత్తులో ఏ బ్యాంకు కూడా రుణాలు ఇవ్వడానికి వీలుండదు. ఇప్పటికే ఉన్న రుణాల పునర్వ్యవస్థీకరణకు లేదా కొత్త రుణాల మంజూరుకు ఆర్‌బీఐ లేదా ఇతర నియంత్రణ సంస్థల ముందుస్తు అనుమతులు తప్పనిసరి అవుతాయి. బ్యాంకు మోసాలపై విచారణ చేపట్టేందుకు సీబీఐ లేదా స్థానిక పోలీసులకు ఈ కేసును నివేదించడం తప్పనిసరి అవుతుంది.

**న్యాయపరమైన ప్రతిస్పందన...** ఈ పరిణామాల నేపథ్యంలో అనిల్ అంబానీ న్యాయవాదులు జూలై 2న ఎస్‌బీఐకి ఒక లేఖ రాశారు. ఎస్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయం ఆర్‌బీఐ మార్గదర్శకాలను, అలాగే వివిధ కోర్టులు జారీ చేసిన ఆదేశాలను ఉల్లంఘించేదిగా ఉందని వారు తీవ్రంగా ఆక్షేపించారు. ముఖ్యంగా అనిల్ అంబానీకి వ్యక్తిగతంగా తన వాదనలు వినిపించే అవకాశం కల్పించకుండానే 'షోకాజ్ నోటీసులు' అనేది కేవలం ఒక తూతూ మంత్రపు ప్రక్రియగా మిగిలిపోయిందని వారు వాదించారు. ఆర్థిక వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుతమైన కార్పొరేట్ పాలనకు ఈ కేసు ఒక పెద్ద పరీక్షగా నిలుస్తోంది. ఒకప్పుడు భారతదేశ టెలికాం రంగంలో కీలక పాత్ర పోషించిన ఆర్‌కామ్ వంటి సంస్థపై మోసం ఆరోపణలు రావడం తీవ్రమైన విషయమే. భవిష్యత్తులో ఈ వ్యవహారంపై కోర్టులు, ఆర్‌బీఐ, అలాగే విచారణ సంస్థలు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి. ఇది భారతీయ కార్పొరేట్ పరిపాలన, రుణ రికవరీ విధానాలపై ఎటువంటి ప్రభావం చూపుతుందో చూడాలి.

# ఒక్కసారిగా 26 వేల అడుగుల కిందకు విమానం.. గాల్లోనే వీలునామాలు.. ఏం జరిగింది?





అహ్మదాబాద్ లో ఎయిర్ పోర్టు నుంచి టెకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే ఎయిరిండియా విమానం కుప్పకూలిపోయిన దగ్గర నుంచి అమాంతంగా కిందకు దిగిపోతున్న విమానాలకు సంబంధించిన వరుస ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జపాన్ కు చెందిన ఎయిర్ లైన్స్ విమానం పెను ప్రమాదం నుంచి బయటపడిన ఘటన సంచలనంగా మారింది. అవును... జపాన్ ఎయిర్ లైన్స్ బోయింగ్ డ్రీమ్ లైనర్ 737 విమానం అకస్మాత్తుగా సుమారు 26,000 అడుగుల కిందకు దిగిపోయింది. ఇదంతా అతిస్వల్ప వ్యవధిలో జరిగిపోయింది. దీంతో... అందులోని ప్రయాణికులు ఆ సమయంలో... తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దీంతో వారంతా ఆక్సిజన్ మాస్క్ లు ధరించి, అవే తమ చివరి క్షణాలు కావచ్చనే భయంలోకి వెళ్లిపోయారు. ఒక్కసారిగా భీకర కుదుపులు రావడంతో మరికొంతమంది ప్రయాణికులు నిద్ర నుంచి అమాంత మేల్కొని, చావు భయాన్ని చవి చూశారు. ఈ నేపథ్యంలో పలువురు ప్రయాణికులు వీలునామాలు రాయగా.. మరికొంతమంది బ్యాంక్ అకౌంట్ లాగిన్ డీటైల్స్, పిన్ నెంబర్స్, మరికొన్ని ముఖ్యమైన విషయాల ను కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. అయినవారికి ఫేర్ వెల్ నోట్స్ పంపారు!

**అసలేం జరిగింది?:** చైనాలోని షాంఘై పుడాంగ్ విమానాశ్రయం నుండి టోక్యోలోని నరిటా విమానాశ్రయానికి జేఎల్8696 విమానం బయలుదేరింది. ఈ సమయంలో విమానం పది నిమిషాల్లోపు 36,000 అడుగుల నుండి 10,000 అడుగుల ఎత్తుకు ఒక్కసారిగా దిగిపోయింది. ఈ సమయంలో కెప్టెన్ వెంటనే అత్యవసర పరిస్థితిని ప్రకటించి, విమానాన్ని ఒసాకాలోని కాన్సాయ్ విమానాశ్రయానికి మళ్లించారు. ఈ సమయంలో... అక్కడ విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. దీంతో.. అంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఇది తమ జీవితాల్లో జరిగిన అతిగొప్ప అద్భుతం అని చెబుతున్నారు. ఆ సమయంలో విమానంలో 191 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. వారిలో ఏ ఒక్కరూ తీవ్రంగా గాయపడకుండా ల్యాండ్ అవ్వడం గమనార్హం!! ఈ సందర్భంగా స్పందించిన జపాన్ రవాణా, పర్యాటక మంత్రిత్వ శాఖ... విమానం దిగుతున్న సమయంలో దాని పీడన వ్యవస్థ అత్యవసర హెచ్చరికను ప్రేరేపించిందని. కొన్ని సెకన్లలోనే, ఆక్సిజన్ మాస్క్ లు పైకప్పు నుండి పడిపోయాయని.. నిద్రిస్తున్న ప్రయాణీకులను మేల్కొలిపి, విమానంలో గందరగోళం పరిస్థితి నెలకొందని తెలిపింది. ఈ క్రమంలో స్పందించిన ఓ ప్రయాణికుడు.. తాము బ్రతకలేమనే భయంతో పలువురు వీలునామాలు రాశారని.. వారి ఆర్థిక వివరాలు కుటుంబ సభ్యులకు పంపించారని.. వారితో పాటు స్నేహితులు, బంధువులకు ఫేర్ వెల్ నోట్స్ రాశారని తెలిపారు. చాలామంది ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడ్డారని.. కొందరు స్పృహ కోల్పోతామని భయపడ్డారని తెలిపారు.

**బోయింగ్ విమానాలపై మరోసారి చర్చ!:** బోయింగ్ విమానాల పనితీరుపై చర్చ పెద్ద ఎత్తున జరుగుతున్న నేపథ్యంలో ఈ తాజా ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. జూన్ 12న అహ్మదాబాద్ లో బోయింగ్ 787 డ్రీమ్ లైనర్ ఘోర ప్రమాదం జరిగి 260 మందిని బలి తీసుకుంది! గత వారం వియత్నాంలో ఆగి ఉన్న విమానాన్ని మరో డ్రీమ్ లైనర్ ఢీకొట్టిన ఘటనల తర్వాత ఈ భయంకరమైన ఘటన వెలుగుచూసింది! మరోవైపు.. జూన్ 12 న అహ్మదాబాద్ లో ఘటన జరిగిన 38 గంటల్లోనే మరో ఎయిరిండియా విమానం టెన్షన్ పెట్టిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... జూన్ 14 తెల్లవారుజామున ఢిల్లీ నుండి బయలుదేరి వియన్నాకు వెళ్తున్న బోయింగ్ 777 విమానం ఒక్కసారిగా 900 అడుగుల మేర కిందికి దిగిపోవడంతో "డోంట్ సింక్" హెచ్చరికను అందుకుంది.

ఈ సందర్భంగా... గత సంవత్సరం అలాస్కా ఎయిర్ లైన్స్ బోయింగ్ విమానంలో ఒక డోర్ ప్యానెల్ గాల్లోనే ఊడిపోయిన ఘటన తాజాగా మరోసారి చర్చకు వచ్చింది. ఈ వరుస ఘటనలు బోయింగ్ విమానాల తయారీలో నాణ్యతను ఎత్తి చూపిస్తున్నాయి!

# మోత మోగనున్న ఊబర్.. ఓలా.. ర్యాపిడో ఛార్జీలు

పట్టణాల్ని పక్కన పెడితే.. నగరాల్లో రవాణా సౌకర్యంగా ఓలా.. ఊబర్.. ర్యాపిడో సేవల్ని వినియోగించుకునే వారి సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇటీవల బెంగళూరు మహానగరంలో బైక్ సేవల్ని అందించే వారిపై పరిమితులు విధించటంతో బెంగళూరు ప్రజలు ఎంత ఇబ్బంది పడ్డారో తెలిసిందే. ప్రజా రవాణా అంతంతమాత్రంగా.. పరిమితంగా ఉన్న నేపథ్యంలో ఓలా.. ఊబర్.. ర్యాపిడో లాంటి క్యాబ్ సర్వీసుల వినియో గం అంతకంతకూ పెరుగుతోంది. ఇదిలా ఉంటే.. ఈ సేవలకు సంబంధించి తాజాగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీ వేళల్లో ఛార్జీలు డబుల్ వసూలు చేసుకోవటానికి వీలుగా కేంద్రం నిర్ణయం తీసుకుంది. అదే సమయంలో మరో నిర్ణయాన్ని తీసుకుంది. రద్దీ లేని సాధారణ వేళల్లో కనీస మొత్తం 50 శాతం కంటే తక్కువ ఛార్జి తీసుకోవద్దని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి కేంద్ర రోడ్డు.. రవాణ.. రహదారుల శాఖ స్పష్టమైన మార్గదర్శకాల్ని విడుదల చేసింది. క్యాబ్ సంస్థలు కనీస ఛార్జీల్లో 50 శాతం తక్కువ నుంచి గరిష్ఠంగా రెండింతలు (డబుల్) వరకు వసూలు చేసుకునే వీలుంది. అంటే.. ఏదైనా ఒక నిర్ణీత దూరానికి బేసిక్ ఫెయిర్ రూ.50 అనుకుంటే.. డిమాండ్ లేని వేళల్లో కనీసం రూ.25 కంటే తక్కువ ఛార్జీ వసూలు చేయకూడదు. అదే సమయంలో రద్దీ వేళల్లో గరిష్ఠంగా రూ.100లకు మించి వసూలు




చేయకూడదు. ఇప్పటివరకు గరిష్ఠ ఛార్జీ ఒకటిన్నర రెట్లు మాత్రమే ఉండేది. అంటే.. ఇప్పటివరకు రూ.75 మాత్రమే వసూలు చేసే దానికి బదులుగా..ఇక నుంచి రూ.100 వరకు వసూలు చేసే వీలు ఉంటుంది. క్యాబ్ బుక్ అయిన తర్వాత డ్రైవర్ సరైన కారణం చెప్పకుండా ప్రయాణాన్ని (రైడ్) ను రద్దు చేసుకుంటే.. రైడ్ ఛార్జీల్లో పది శాతం.. ఆ మొత్తం రూ.100కు మించకుండా ఫైన్ గా వేయొచ్చు. అదే సమయంలో ప్రయాణికులు రద్దు చేసినా.. ఇదే నిబంధనను వర్తించేలా నిర్ణయం తీసుకున్నారు. బుక్ చేసుకున్న తర్వాత ప్రయాణికుడ్ని పికప్ చేసుకోవటానికి క్యాబ్ ప్రయాణించే దూరం 3 కిలోమీటర్ల లోపు ఉన్నప్పుడు దానికి ఎలాంటి ఛార్జీ విధించకూడదని స్పష్టం చేశారు. మరో కీలకమైన ఆదేశాన్ని కేంద్రం జారీ చేసింది. క్యాబ్ డ్రైవర్ సంబంధిత సంస్థ తమ యాప్ లో పేర్కొన్న దారిలోనే ప్రయాణించాల్సి ఉంటుంది.అందుకు భిన్నంగా దారి మారిస్తే.. వెంటనే కంట్రోల్ రూంను అప్రమత్తం చేసేలా అగ్రిగేటర్లు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. క్యాబ్ సంస్థలు ప్రయాణికుల కోసం కనీస బీమా రూ.5 లక్షలు తీసుకోవాలి. డ్రైవర్లకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా.. రూ.10 లక్షలు టెర్మ్ బీమాను తీసుకోవాల్సి ఉంటుంది. క్యాబ్ సంస్థలు రిజిస్ట్రేషన్ చేసిన నాటి నుంచి ఎనిమిదేళ్లు దాటిన వాహనాల్ని సర్వీసు లో ఉంచకూడదు. ప్రతి వాహనంలోనూ లొకేషన్ ట్రాకింగ్ పరికరాల్ని తప్పనిసరిడా అమర్చుకోవాల్సి ఉంటుంది. టూవీలర్ల వాహనాల్ని క్యాబ్.. ట్యాక్సీ సేవల కోసం వినియోగించుకోవటానికి వీలుగా కేంద్రం అవకాశం ఇచ్చింది. ఇందుకు ఆయా రాష్ట్రాలు మార్గదర్శకాలు ఇవ్వాలని.. ఆ సేవల్ని అందించే సంస్థల నుంచి ఛార్జీలు వసూలు చేసుకునేందుకు వీలుగా సూచనలు చేసింది. మొత్తంగా కేంద్రం తీసుకు న్న తాజా నిర్ణయంతో ఛార్జీల భారం ప్రయాణికుల మీద పడుతుందని మాత్రం చెప్పక తప్పదు. అందులోనూ పీక్ వేళల్లో బుక్ చేస్తే.. ఛార్జీల మోత ఓ రేంజ్ లో ఉండటం ఖాయం. సో. బీరెడీ.

## సినిమా 'షో'


# అనుపమ బౌన్స్ బ్యాక్ ఛాన్సులు..!

మలయాళ భామ అనుపమ పరమేశ్వరన్ తెలుగులో స్టార్ హీరోయిన్ గా అయ్యే ఛాన్స్ లు కనిపించినా అమ్మడు చేసిన కొన్ని సినిమాల వల్ల గ్రాఫ్ పడిపోయింది. మొదట్లో అనుపమని చూసి టాలీవుడ్ కి మరో స్టార్ హీరోయిన్ వచ్చిందన్న టాక్ వినబడింది. కానీ అమ్మడు మాత్రం ఎందుకో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. తెలుగులో రెండేళ్ల క్రితం ఈగల్ సినిమాలో నటించిన అనుపమ ఆ తర్వాత పెద్దగా ఛాన్స్ లు అందుకోలేదు. లాస్ట్ ఇయర్ వచ్చిన టిల్లు స్క్వేర్ సూపర్ హిట్ అయినా కూడా అనుపమకి ఏమాత్రం లాభం చేకూరలేదు. ఆ తర్వాత అసలు అవకాశాలన్న మాటే రాలేదు. ఐతే తెలుగులో కాస్త గ్యాప్ రాగా.. ఈ గ్యాప్ లో తమిళ్ లో సినిమాలు చేస్తూ వచ్చింది అనుపమ. రీసెంట్ గా అమ్మడు డ్రాగన్ సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. కానీ ఆ సినిమాలో అనుపమ కన్నా మరో హీరోయిన్ గా నటించిన కయదు



లోహార్ కి ఎక్కువ క్రేజ్ వచ్చింది. ఐతే తెలుగులో అనుపమ కెరీర్ ఇక దాదాపు ముగిసింది అనుకునేలోగా మళ్లీ వరుస ఛాన్స్ లు అమ్మడి తలుపు తడుతున్నాయి. అనుపమ ఇప్పటికే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా చేస్తున్న కిష్కింధపురి సినిమాలో హీరోయిన్ గా నటిస్తుంది. కొన్నాళ్లుగా సెట్స్ మీద ఉన్న ఈ సినిమాకు టైటిల్ లాక్ చేసి ఒక పోస్టర్ కూడా వదిలారు. ఆల్రెడీ అనుపమ సాయి శ్రీనివాస్ తో రాక్షసుడు సినిమా చేసింది. ఆ సినిమా సక్సెస్ అందుకుందని తెలిసిందే. మరోపక్క యువ హీరో ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ తో కూడా లక్కీ ఛాన్స్ పట్టేసింది అనుపమ. శర్వానంద్ సంపత్ నంది కాంబినేషన్ లో వస్తున్న పీరియాడికల్ సినిమాలో అనుపమ హీరోయిన్ గా ఓకే అయ్యింది. ఈమధ్యనే ఓదెల 2 తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంపత్ నంది. ఈసారి తన డైరెక్షన్ లో సినిమాతో ఆడియన్స్ ని అలరించడానికి రెడీ అయ్యాడు. సంపత్ నంది శర్వానంద్ కాంబో సినిమా 1965 కాలం నాటి కథతో వస్తుందని తెలుస్తుంది. సో పీరియాడికల్ కథ, క్రేజీ కాంబినేషన్ కాబట్టి ఇది అనుపమకి కలిసి వచ్చేలా ఉందని చెప్పొచ్చు. అనుపమ మాత్రం తిరిగి మళ్లీ తన ఫాం కొనసాగించాలని చూస్తుంది. ఈ ప్రయత్నంలో అమ్మడికి ఎలాంటి ఫలితాలు అందుతాయన్నది చూడాలి.

# ఢీ అంటే ఢీ: 'వార్ 2' కథేంటో తెలుసా?



భారతీయ సినిమా హిస్టరీలో నెవ్వర్ బిఫోర్ అనిపించే కాంబినేషన్‌తో యష్ రాజ్ ఫిలింస్ రూపొందిస్తున్న 'వార్ 2' ఈ ఏడాది మోస్ట్ అవైటెడ్ కేటగిరీలో విడుదలకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. సౌత్ సూపర్ స్టార్ ఎన్టీఆర్, నార్త్ సూపర్ స్టార్ హృతిక్ రోషన్ కలయికలో అత్యంత భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ ఇది. 'బ్రహ్మాస్త్ర' ఫేం అయాన్ ముఖర్జీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. వార్ 2 లో ఎన్టీఆర్, హృతిక్ ఒకరికొకరు ఎదురు పడితే నువ్వా నేనా? అంటూ బాహాబాహీకి దిగుతారని, నెవ్వర్ బిఫోర్ అనిపించే ట్రీట్ అభిమానులకు అందిస్తున్నామని ఊరించారు తప్ప అసలు ఈ సినిమా కథాంశం ఏమిటన్నది ఇంతవరకూ లీక్ చేయలేదు. తాజాగా అమెరికన్ ఆన్ లైన్ టికెటింగ్ వెబ్ సైట్ ఫండగో 'వార్ 2' కథాంశాన్ని లీక్ చేసింది. భారతదేశానికి అత్యంత ప్రమాదకారిగా మారిన ఏజెంట్ కబీర్ ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు నియమితుడైన ఏజెంట్ విక్రమ్ స్టోరి ఏమిటన్నదే ఈ సినిమా. విక్రమ్ పాత్రలో ఎన్టీఆర్ నటించాడు. ఏజెంట్ కబీర్ తో సమాన హెూదా ఉన్న ఆఫీసర్ విక్రమ్. పరిస్థితులు అదుపుతప్పుతున్న క్రమంలో భారత స్పై ఏజెన్సీ అతడిని రంగంలోకి దించుతుంది. అతడు తన క్రూరమైన, రాక్షసత్వంతో కూడుకున్న టీమ్ తో ఆపరేషన్ లోకి దిగుతాడు. అదే క్రమంలో కబీర్ వర్సెస్ విక్రమ్ ఎపిసోడ్స్ ఎలుకా పిల్లి ఆట ఏమిటన్నది తెరపై చూడాల్సిందేనని సదరు వెబ్ సైట్ కథను లీక్ చేఇసంది. ఛేజ్‌లు, స్టంట్స్ తో పాటు రక్తపాతం భీభత్స వాతావరణం తెరపై ఆవిష్కృతమైందని చెబుతున్నారు. యుద్ధ భూమిలో అత్యంత క్రూరమైనవాడిగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ విరుచుకుపడుతుంటాడు. అతడిని చూస్తే టెర్మినేటర్ గుర్తుకు వస్తాడు! అంటూ ఫండగో తన కథనంలో వెల్లడించింది. మొత్తానికి వార్ 2లో హృతిక్ ని ఢీకొట్టే ధీటైన వాడిగా తారక్ ని అభిమానులు చూడబోతున్నారని ఈ కథనం రివీల్ చేసింది. వార్ 2 ఆగస్టు 14న స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా విడుదలవుతోంది. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ లో అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రంగా ఇది రూపొందుతోంది.

# చీర కట్టులో కేతిక రొమాంటిక్..!

నితిన్ హీరోగా నటించిన 'రాబిన్‌హుడ్' సినిమాలో అదిదా సర్‌ప్రైజ్ అంటూ ఐటెం సాంగ్ చేసి అందరినీ నిజంగానే సర్‌ప్రైజ్ చేసిన ముద్దుగుమ్మ కేతిక శర్మ. ఆమె కాస్ట్యూమ్స్, మేకోవర్, డాన్స్ స్టెప్పులు ఇలా ప్రతి ఒక్కటీ మాస్ ఆడియన్స్‌కి నచ్చాయి. కేతిక శర్మ హీరోయిన్‌గా కెరీర్ ఆరంభంలో మంచి సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకున్నప్పటికీ లక్ కలిసి రాకపోవడంతో తక్కువ సమయంకే హీరోయిన్‌గా ఆఫర్లు లేకుండా పోయాయి. హీరోయిన్‌గా ప్రస్తుతం ఈమె చేస్తున్న సినిమాలు పెద్దగా ఏమీ లేదు. అయినా కూడా ఈమెకు సోషల్ మీడియా ద్వారా మంచి గుర్తింపు దక్కింది. ఈమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 3.5 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్న విషయం తెల్సిందే. సినిమాల్లో అందంగా కనిపించడంతో పాటు, నటనతో మెప్పించే కేతిక శర్మ సోషల్ మీడియాలో పూర్తి స్థాయిలో అందాల ఆరబోతతో ఆకట్టుకుంటూ ఉంది. అందంగా ఉండే కేతిక శర్మ సింపుల్ ఔట్ ఫిట్ నుంచి స్కిన్ షో చేసే ఔట్ ఫిట్ వరకు ఏ డ్రెస్‌లో కనిపించినా కూడా చూపు తిప్పుకోనివ్వని అందం ఈమెది అనడంలో సందేహం లేదు. హీరోయిన్‌గా ఈమెకు మంచి ఎంట్రీ దక్కడానికి కారణం ఈమె అందం అనడంలో సందేహం లేదు. ముందు ముందు ఈమె మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకోవచ్చు. తాజాగా ఈమె ఇన్‌స్టాలో షేర్ చేసిన ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.



సాధారణంగానే హీరోయిన్స్ చీర కట్టు ఫోటోలను షేర్ చేస్తూ చూపు తిప్పుకోలేము. అలాంటిది కేతిక శర్మ వంటి అందగత్తె చీర కట్టుకుని, అందంగా కెమెరాకు ఫోజ్ ఇస్తున్న వీడియో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. సాధారణంగా ఫోటో స్టిల్స్ ను షేర్ చేస్తారు. కానీ ఈ అమ్మడు ఫోటో షూట్‌కి సంబంధించిన వీడియోను షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతోంది. కేతిక శర్మ అందం గురించి గతంలో ఎన్నో సార్లు మాట్లాడుకునే ఉంటాం. అయినా కూడా ఈమె ఇలాంటి వీడియోలను, ఫోటోలను షేర్ చేసిన సమయంలో మరోసారి ఈమె అందం గురించి మాట్లాడుకోవాల్సిందే అనిపిస్తూ ఉంటుంది. నడుము అందం చూపిస్తూ కేతిక హెుయలు పోతూ షేర్ చేసిన వీడియో ఆకట్టుకుంటూ ఉంది. చీర కట్టులో కేతిక శర్మ ఫోటోలు చాలా సార్లు షేర్ చేసింది. అయితే ఈసారి అంతకు మించి అన్నట్లుగా ఆకట్టుకుంటుంది. అందమైన ఫోటోలు, వీడియోలతో ఎప్పుడూ కేతిక శర్మ వార్తల్లో నిలుస్తున్న కారణంగా కచ్చితంగా ఈమెకు మరిన్ని ఆఫర్లు దక్కవచ్చు. ప్రస్తుతం రెండు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నట్లు సమాచారం అందుతోంది. త్వరలోనే ఆ సినిమాలకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి అయ్యే అవకాశాలు ఉన్నాయి. హీరోయిన్‌గా ఈమె చివరిగా రంగ రంగ వైభవంగా సినిమాలో వైష్ణవ్ తేజ్‌కు జోడీగా నటించింది. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ బ్రో సినిమాలో కీలక పాత్రలో కనిపించింది. ఆ సినిమా తర్వాత ఒక హిందీ సినిమాను కూడా ఈమె చేసింది.

Name of Premises : Venus Enclave, Block - 0, Quthbullapur City, Medchal Malkajgiri District - 500055, email : sanjeevreddyetlapuram@gmail.com. Cell : 8985829417